## అయ్యప్ప ఆలయ అధ్యక్షుడిగా శ్రీనివాస్

అంబటి శ్రీనివాస్

కోరుట్ల, ఫిబ్రవరి 11: పట్టణంలోని అయ్యప్ప, జ్ఞాన సరస్వతీ మాత ఆలయ అధ్యక్ష ఎన్నికలు ఆదివారం నిర్వహించినట్లు ఆలయ ఎన్నికల అధికారులు పోతని ప్రవీణ్‌కుమార్, ఆకుల రాజేశ్ తెలిపారు. అధ్యక్షుడిగా అంబటి శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని ఆలయ గౌరవాధ్యక్షుడు చిద్రాల నారాయణ సమక్షంలో ఎన్నికల అధికారులు అందజేశారు.

## మహాసభలకు తరలిన టీపీటీఎఫ్ నాయకులు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 11 : ఖమ్మం జిల్లా కేంద్రంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలకు జిల్లా కేంద్రం నుంచి ఆదివారం టీపీటీఎఫ్ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బోగ రమేశ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ వారసత్వాన్ని కొనసాగిస్తూ రాష్ట్రంలో తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నదన్నారు. ప్రతి నాలుగు సంవత్సరాలకోసారి ఫెడరేషన్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తున్నదని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా నాయకులు రామచంద్రం, రఘుపతి, గోవర్ధన్, చంద్రశేఖర్, నాగభూషణం, మహేశ్, రాజనరసయ్య, సుధాకర్, చంద్రమౌళి, విజయ్‌కుమార్, రఘుపతి, శ్రీనివాస్, అశోక్, రవీందర్, రాజయ్య, మోహన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనం

జగిత్యాల, ఫిబ్రవరి 11 : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల ఆత్మీయ సమ్మేళనం జిల్లా అధ్యక్షుడు గడ్డం రమేశ్ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫీల్డ్ అసిస్టెంట్ల అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు శ్యామలయ్య, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు ఆనంద్, కార్యదర్శి సామేందర్, కరీంనగర్, పెద్దపల్లి, హన్మకొండ జిల్లాల అధ్యక్షులు యాదగిరి, మల్లన్న, మహేందర్, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో టీఎల్ఎఫ్ నూతన క్యాలెండర్‌ను రాష్ట్ర కన్వీనర్ పోకల నాగయ్య ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు గపూర్, కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు సత్యనారాయణరాజు, జిల్లా కార్యదర్శి రమేశ్, నాయకులు దయాకర్, ఎర్రం శ్రీనివాస్, అనిల్, బ్రహ్మం, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వెల్గటూర్, ఫిబ్రవరి 11: ఎండపల్లి మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన బోగ లచ్చయ్య (55) రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. లచ్చయ్య వృత్తి రీత్య ఆటో డ్రైవర్. మధ్యాహ్నం ఆటోను బస్టాండ్ వద్ద నిలిపి లంచ్‌కు ఇంటికి వస్తున్న సమయంలో వెల్గటూర్ నుంచి కరీంనగర్‌కు అతి వేగంగా వెళ్తున్న కారు లచ్చయ్యను ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబసభ్యులు చికిత్సకు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## భవన నిర్మాణానికి భూమిపూజ

కథలాపూర్, ఫిబ్రవరి 11 : చింతకుంటలో కుమ్మరి సంఘం భవనానికి ఆదివారం జడ్పీటీసీ నాగం భూమయ్య భూమిపూజ చేశారు. అనంతరం బోరుబావి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో రాధారపు రాజశేఖర్, రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఆదర్శం.. బీర్‌పూర్ పీఏసీఎస్

- 12 ఏళ్లుగా వందశాతం రుణాల రికవరీ
- రైతులకు మెరుగైన సేవలు
- సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్, గోదాంల నిర్మాణం, తుంగూర్‌లో కేడీసీసీబీ బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు

సారంగాపూర్, ఫిబ్రవరి 11: బీర్‌పూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) ఉమ్మడి జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తున్నది. 1961లో ఏ ర్పాటు చేసిన సహకార సంఘంలో బీర్‌పూర్, నర్సింహులపల్లి, తుంగూర్, కండ్లపల్లి, చర్లపల్లి, మంగెళ, రంగసాగర్ గ్రామాల నుంచి మొత్తం 1817 మంది సభ్యులు ఉన్నారు. 12 ఏళ్లుగా సహకార సంఘంలో సభ్యులు తీసుకుంటున్న రుణాలు సకాలంలో వందశాతం చెల్లిస్తున్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో మోతీనగర్, తుంగూ ర్, చర్లపల్లి, కండ్లపల్లి, రంగసాగర్ గ్రామా ల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపడుతున్నారు. రైతులకు ఆధార్ కోసం ఇబ్బందులు లేకుండా సహకార సంఘంలోనే సీఎస్సీ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రతి సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు, జనుము, జీలుగ, విత్తనాలను అందిస్తున్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో బీర్‌పూర్‌లో గోదాం నిర్మాణం, పెట్రోల్ బంక్ ఏర్పాటు, రైస్‌మిల్ ఏర్పాటుకు స్థలం, ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణం, మంగెళలో గోదాం నిర్మాణం, రైస్‌మిల్, గోదాం ఏర్పాటు, తుంగూర్‌లో 15 గుంటల స్థలం కొనుగోలు, ఫర్నీచర్ కొనుగోలు చేపట్టారు. ఏప్రిల్ 1, 2023 నుంచి 20 సెప్టెంబర్ వరకు స్వల్పకాలిక రుణాల కింద 665 మందికి రూ.4 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద 96 మందికి రూ.2 కోట్లు, వ్యాపారం, కిరాణా రుణాల కింద 68 మందికి రూ.37 లక్షలు, ద్విచక్ర వాహనాలకు 64 మందికి రూ.1,99,446, గోల్డ్ రుణాలు 48 మందికి రూ.35,143,00, డిపాజిట్ల మీద రుణాలు 19 మందికి రూ.25,35,093 అందజేశారు. తుంగూర్ గ్రామంలో కేడీసీసీ బ్యాంక్ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసి సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తూ రూ.3.20 కోట్ల స్వల్పకాలిక రుణాలు అందజేశారు.

ఉమ్మడి జిల్లాలోనే బీర్‌పూర్ సహకారం సంఘం రుణాల రికవరీలో ఆదర్శంగా నిలుస్తుండడంతో ఇటీవల సహకార సంఘం చైర్మన్ ముప్పాల రాంచందర్ రావు, సీఈవో అయ్యోరి తిరుపతిని న్యాఫ్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు వారిని అభినందిస్తూ ఘనంగా సన్మానించారు.

బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం

### సభ్యుల సహకారంతోనే అభివృద్ధి

సభ్యుల సహకారంతోనే బీర్‌పూర్ సహకార సంఘం అభివృద్ధి దిశలో పయనిస్తున్నది. సంఘం అభివృద్ధికి సభ్యులు తమవంతు సహకారం అందిస్తున్నారు. ఇప్పటి వరకు సహకార సంఘం నుంచి రైతులు తీసుకుంటున్న రుణాలను సకాలంలో వందశాతం చెల్లిస్తూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. 12 సంవత్సరాలుగా రుణాల రికవరీలో వందశాతంతో ఉమ్మడి జిల్లాలో ఆదర్శంగా నిలుస్తుంది.

**- ముప్పాల రాంచందర్ రావు, జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్, విండో చైర్మన్ బీర్‌పూర్**

## పట్టణాధ్యక్షుడిగా గోపాల్

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 11 : బీజేపీ జగిత్యాల పట్టణాధ్యక్షుడిగా రంగు గోపాల్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రంగు గోపాల్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తానన్నారు.

## యువకుడి రక్తదానం

రక్తదానం చేస్తున్న గంగాధర్

కోరుట్ల, ఫిబ్రవరి 11: పట్టణానికి చెందిన గెల్లె గంగాధర్ తన కూతురు వైష్ణవి పుట్టిన రోజు పురస్కరించుకొని ఆదివారం మెట్‌పల్లిలోని బ్లడ్ బ్యాంకు వెళ్లి రక్తదానం చేశాడు. రక్తదాతను బ్లడ్ బ్యాంకు సిబ్బంది, కోరుట్ల సేవాదళ్ అధ్యక్షుడు, రక్తదాన సంధాన కర్త నాగరాజు అభినందించారు.

# ఎన్నికల హామీలను నెరవేరుస్తాం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కును అందజేస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ధర్మపురి, ఫిబ్రవరి 11: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అలాగే కొనసాగిస్తున్నామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు కొద్ది రోజుల్లోనే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూ.1,00,116 నగదు సాయంతో పాటు అదనంగా తులం బంగారం కూడా అందజేయనున్నామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ధర్మపురి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ధర్మపురి మండలానికి చెందిన 50 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ.1,00,116 చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా నగదు సాయంతో పాటు అదనంగా తులం బంగారం కూడా అందజేస్తామని, ఈ మేరకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బత్తిని అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, డీటీ సుమన్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్, యూత్ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్ తదితరులున్నారు.

# సమాజానికి చేయూతనివ్వాలి

నృత్యం చేస్తున్న అల్ఫోర్స్ విద్యార్థులు

జగిత్యాల, ఫిబ్రవరి 11 : విద్యార్థులు సమాజానికి చేయూత నివ్వాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి సూచించారు. ఆదివారం అల్ఫోర్స్ విద్యార్థుల వార్షిక వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచిస్తూ నూతన ఒరవడికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నారు. అనంతరం నరేందర్ రెడ్డిని విద్యార్థులు, ఘనంగా సన్మానించి గురుభక్తిని చాటారు. కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోరుట్ల : ముత్యాల పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

# గ్రామదేవతకు మొక్కులు

### బోనం సమర్పించిన మహిళలు

కోరుట్ల, ఫిబ్రవరి 11: పట్టణంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి చలి బోనాలు సమర్పించారు. మహిళలు అమ్మవారికి బెల్లం, పుట్నాలు, చలి బోనం నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మారుతీనగర్, ఫిబ్రవరి 11 : మెట్‌పల్లి పట్టణంలో ఐదు చేతుల పోచమ్మ, నల్ల పోచమ్మ, బండమీద పోచమ్మకు ఆయా వార్డుల నుంచి మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజాప్రతినిధులు గ్రామదేవతలను దర్శించుకున్నారు.

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు పోచమ్మ తల్లికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. మహిళలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తపాల్గొన్నారు.

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 11: జిల్లా కేంద్రంలోని గాజుల పోచమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రతి ఏటా శీతాకాలం చివరిలో అమ్మవారికి చలి బోనాలు సమర్పించి మొ క్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోని పోచమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు.

కథలాపూర్, ఫిబ్రవరి 11: మండలంలో ఆదివారం పోచమ్మ చలిబోనాల జాతర ఘనంగా నిర్వహించారు. మహిళలు వేకువజాము నుంచే పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మేడిపల్లి, పిబ్రవరి 11: మేడిపల్లి, భీమారం మండలాల్లో మహిళలు బోనాలతో వెళ్లి పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మల్లాపూర్: వేంపల్లి గ్రామశివారులోని పోచమ్మ ఆలయానికి బోనంతో వెళ్తున్న మహిళలు

మేడిపల్లి: చలి బోనాలతో వెళ్తున్న మహిళలు

కోరుట్ల రూరల్: చలి బోనాలతో వెళ్తున్న మహిళలు

సమావేశంలో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి

# ప్రజలను మభ్య పెట్టేందుకే ప్రజాహిత యాత్ర

కథలాపూర్, ఫిబ్రవరి 11 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునేందుకే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి విమర్శించారు. ఆదివారం కథలాపూర్‌లో బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో ఎంపీ బండి మండలానికి ఎన్ని నిధులు మంజూరు చేశారు, కొండగట్టు హనుమాన్ ఆలయం అభివృద్ధికి ఎంపీ కోటాలో ఎన్ని నిధులు వెచ్చించారో చెప్పాలన్నారు. దేశం కోసం, ధర్మంకోసం అంటూ యువకులను రెచ్చగొట్టితే వచ్చే ఎన్నికల్లో ఎంపీకి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. సమావేశంలో జడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు గంగాధర్, నాగేశ్వర్‌రావు, ఆంజనేయులు, వెంకటేశ్వర్‌రావు, జనార్దన్‌రెడ్డి, ముస్కు శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, లింబాద్రి, ప్రిన్స్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రతాప్, రమేశ్ పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో కేంద్రం నిధులే అధికం

కథలాపూర్, ఫిబ్రవరి 11 : గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల్లో కేంద్ర ప్రభుత్వ నిధులే అధికమని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలో రెండో రోజు ప్రజాహిత యాత్ర సిరికొండ, కథలాపూర్, దుంపేట, దూలూర్, పోసానిపేట, తాండ్రాల, అంబారిపేట, కలికోట గ్రామాల్లో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ బండి ఆయా గ్రామాల్లో అంబేద్కర్, శివాజీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ నియోజకవర్గ నేత చెన్నమనేని వికాస్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణరావు, ప్రతాప రామకృష్ణ ఎంపీ సంజయ్‌కుమార్‌కు మద్దతు ప్రకటించి గ్రామాల్లో పాదయాత్ర చేశారు. నాయకులు గోపాల్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, సత్యం, శ్రీనివాస్, ప్రవీణ్‌గౌడ్, కిశోర్, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

సిరికొండలో ప్రజాహిత యాత్రలో పాల్గొన్న ఎంపీ బండి సంజయ్

# మహిళా వైద్యురాళ్ల క్రికెట్ పోటీలు

జగితాల : క్రికెట్ పోటీల్లో పాల్గొన్న వైద్యులు

జగిత్యాల, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రంలోని ఐఎంఏ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా వైద్యులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సతీమణి రాధిక ప్రారంభించారు. నిత్యం బిజీగా ఉండే వైద్యులు క్రికెట్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు తాటిపాముల సురేశ్ కుమార్, వైద్యులు జయంతి, పద్మారాథోడ్, గీతిక, మృదుల పాల్గొన్నారు.

### కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్..

కోరుట్ల, ఫిబ్రవరి 11: పట్టణంలోని నీలిస్ మైదానంలో ఆదివారం కేపీఎల్ సీజన్ - 4 క్రికెట్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్ ప్రారంభించారు. టెన్నిస్ బాల్‌తో నిర్వహించే ఈ టోర్నీ మార్చి 3 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోయిని సత్యనారాయణ, జిందం లక్ష్మీనారాయణ, నీలి శ్రీనివాస్, తిరుమల గంగాధర్, నయీమ్, రఫీ, అన్వర్, కేపీఎల్ టోర్నీ నిర్వాహకులు మోయీజ్, షబ్బీర్, మోసిన్, మహ్మద్ అబ్దుల్ బారీ పాల్గొన్నారు.

### వీవీరావుపేటలో

మల్లాపూర్, ఫిబ్రవరి 11: వీవీరావుపేటలో తలపెట్టిన అండర్-15 వీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్ఐ నవీన్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని యువత క్రీడలతో పాటు, అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఇక్కడ నాయకులు, క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

కోరుట్ల : టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అనిల్

మల్లాపూర్: క్రీడాకారులకు పరిచయం చేసుకుంటున్న ఎస్ఐ

## నర్సన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, ఫిబ్రవరి 11: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సెలవు దినం కావడంతో పాటు, ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

## నిత్యావసరాల అందజేత

మేడిపల్లి, పిబ్రవరి 11 : భీమారం మండల కేంద్రానికి చెందిన దయ్య సురేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వారి ఆర్థిక ఇబ్బందులను వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్‌కు నాయకుడు బక్కూరి నరేశ్ ఫోన్‌లో వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే అండగా ఉంటానని హామీ ఇచ్చి నిత్యావసర సరుకులను నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ గౌడ్, సంజీవ్, సత్యనారాయణ, అనిల్, లక్ష్మణ్, రమేశ్, వంశీ పాల్గొన్నారు.

## దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 11 : జగిత్యాల జిల్లా కేంద్రంలో భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో ఆదివారం దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం, కార్యదర్శి సింగం గంగాధర్, నరేందుల శ్రీనివాస్, ఒడ్డుపెల్లి మురళీధర్, దుబ్బరాజం, బొందుకూరి శ్రీనివాస్, సిరిపురం గంగారాం పాల్గొన్నారు.

# వచ్చే నెల నుంచి కరెంట్ బిల్లు ఎవరూ కట్టొద్దు

- 'గృహజ్యోతి'లో 200 యూనిట్ల ఫ్రీస్కీం అమలు చేస్తాం
- గంగపుత్రుల హక్కులు కాపాడుతా..
- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 11: 'కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది. ఇప్పటికే మహిళలకు బస్సుల్లో ఫ్రీ ప్రయాణ సౌకర్యం కల్పించాం. గృహజ్యోతిలో భాగంగా 200యూనిట్ల ఫ్రీ కరెంట్ స్కీం అమలు చేస్తాం. వచ్చే నెల నుంచి ఎవరూ కరెంటు బిల్లు కట్టాల్సిన అవసరం లేదు' అని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా ఫిషర్ సెల్ అధ్యక్షుడు తోపారపు రజనీకాంత్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జగిత్యాల జిల్లా గంగపుత్ర మహాసభకు హాజరై, మాట్లాడారు. గంగపుత్రుల హక్కులు కాపాడుతామని, రోళ్లవాగు తెగిపోవడంతో నష్టపోయిన మత్స్యకారులకు పరిహారం అందిస్తానని చెప్పారు. గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, కుల సంఘ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చితే గంగపుత్రుల హక్కులకు భంగం కలుగుతుందనే అపోహ ఉందని, కానీ ఎవరికీ ఇబ్బందులు రాకుండా తాను బాధ్యత తీసుకుంటానని భరోసా కల్పించారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు కుల గణన చేపట్టి, రిజర్వేషన్లు 25 నుంచి 40 శాతానికి పెంచాలని కాంగ్రెస్ సర్కారు భావిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళలకు బస్సుల్లో ఫ్రీ జర్నీ స్కీం అమలు చేస్తున్నదని చెప్పారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు అందిస్తామని, వచ్చే నెల నుంచి 200యూనిట్ల వరకు ఎవరూ కరెంటు బిల్లులు కట్టాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. చెరువుల ఎఫ్టీఎల్ ఆక్రమణ జరిగితే తొలగించే బాధ్యత తనది అని స్పష్టం చేశారు. చెరువులు ఆక్రమణ గురికాకుండా, సామర్థ్యాన్ని కాపాడడం, సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారికి 50ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తామని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఫిషర్ సెల్ అధ్యక్షుడు మిట్ట సాయికుమార్, గిరినాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మార్పణ దినోత్సవం

కోరుట్ల, ఫిబ్రవరి 11: పట్టణంలోని వాసవీమాత ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మారుతీనగర్, ఫిబ్రవరి 11 : మెట్‌పల్లి పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య పట్టణాధ్యక్షుడు మైలారపు రాంబాబు ఆధ్వర్యంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మైలారపు లింబాద్రి, పట్టణ కార్యదర్శి రవి, కోశాధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల టవర్ సర్కిల్, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘంలో వాసవీమాతా ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. సామూహిక కుంకుమాభిషేకం, అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాసవీ మాత ఆలయ ట్రస్టు సభ్యులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సారంగాపూర్, ఫిబ్రవరి11: పెంబట్ల శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు మరియాల రాజన్న, ప్రధాన కార్యదర్శి యాశాల మల్లికార్జున్, నాయకులు పాల్గొన్నారు.